సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024

I



తుది దశకు టెన్త్ స్పాట్

టెన్త్ మూల్యాంకనం తుది దశకు చేరుకుంది. అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.


-IIలో



ఆటో-ట్రాక్టర్ ఢీ

లింగాలపాడు వద్ద ఆటో ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఓ వృద్ధురాలు మృతి చెందింది.

-IIలో



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది	సోమ
సాయంత్రం	ఉదయం
6.13	4.28

న్యూస్‌రీల్

ఉద్దానంలో అటవీ శాఖాధికారుల అవగాహన



బహడపల్లిలో అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖాధికారులు

మందస: ఉద్దానంలో ఎలుగుబంట్లు బీభత్సం సృష్టిస్తుండడంతో అటవీ శాఖాధికారులు ప్రజలను చైతన్యపరుస్తున్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము ఆధ్వర్యంలో శనివారం మందస మండలంలోని బహడపల్లి, నారాయణపురం, నల్లబొడ్లూరు, బిడిమి, అనకాపల్లి, సంతోష్‌నగర్ తదితర గ్రామాల్లో పర్యటించి, ఎలుగుబంట్లపై అవగాహన కల్పించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో.. మైక్ ద్వారా వివరించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, జీడి, మామిడితోటలకు వెళ్లేటప్పుడు శబ్దం చేయాలని, చేతికర్రలను పట్టుకోవాలన్నారు. సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత తోటల్లో ఉండరాదన్నారు. గ్రామాల్లోకి ఎలుగుబంట్లు వచ్చేటప్పుడు తప్పక అటవీ శాఖాధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు ఎం.పోలయ్య, దుర్గాదేవి, వెన్నెల, ఏబీఓలు ఎ.బాబురావు, సురేష్ పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తత



వైద్యాధికారులకు సూచనలిస్తున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

సరుబుజ్జిలి: జ్వరాలపై క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతి ప్రభ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలు, ల్యాబ్‌లో జరుగుతున్న డెంగీ, మలేరియా పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న కాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, జ్వరాలు సోకకుండా ముందస్తు రక్త తనిఖీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సంతోష్‌కుమార్, సాహితి, సీహెచ్‌ఓ మోహనరావు, ల్యాబ్ టెక్నీషియన్ మాధవీలత పాల్గొన్నారు.

అభ్యర్థులతో కూటమి

దోబూచులాట!


- అసంతృప్తులకు కూడా టికెట్ హామీలిస్తున్న టీడీపీ అధిష్టానం
- చివరి వరకు పోటీలో ఉంటామో లేదోనని భయపడుతున్న అభ్యర్థులు
- శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల, పలాస నియోజకవర్గాలపై కొనసాగుతున్న ప్రతిష్టంభన



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు అయోమయ పరిస్థితుల్లో పడ్డారు. టీడీపీ అధిష్టానం అసంతృప్తులకు టికెట్ ఆశలు కల్పిస్తుండడం, సర్వేలు కూడా రహస్యంగా నిర్వహిస్తుండడం, అసంతృప్తులు తమకు టికెట్ వస్తుందని అనుచరులతో చెబుతుండడంతో ఇదివరకు టికెట్ పొందిన వారిలో మార్పు గుబులు మొదలైంది. ఎన్నికలకు చాలా సమయం ఉండటం...ఈ లోపు అభ్యర్థులు మార్చే విషయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి కసరత్తు చేస్తుండటంతో ఇప్పుడున్న వారిలో అభద్రతా భావం నెలకొంది. అసంతృప్తుల నుంచి వస్తున్న ఒత్తిళ్లో, రాజకీయ సమీకరణాలో తెలీదు గానీ గ్రాఫ్ పెరగలేదన్న కారణం చూపి అభ్యర్థులను మార్చేస్తారన్న లీకులతో ప్రస్తుత అభ్యర్థులకు బెంగ పట్టుకుంది.

శ్రీకాకుళం..



జిల్లాలో శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల, పలాస నియోజకవర్గాలకు ఇప్పటికే కూటమి ప్రకటించిన అభ్యర్థులపై ఊగిసలాట నడుస్తోంది. శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన గొండు శంకర్‌ను ఆ పార్టీలో ఓ వర్గం పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తుంది. కలిసి పనిచేసేది లేదని, ఎన్నికల్లో ఓడిస్తామని అసంతృప్తివాదులంతా బహిరంగంగా ప్రకటిస్తున్నారు. చివరికీ.. గొండు శంకర్‌ను వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడుతున్నారు. ఇదే సమయంలో టికెట్ ఆశించి భంగపడిన గుండ లక్ష్మీ దంపతులు వెనక్కి తగ్గడం లేదు. అధిష్టానంతోనే తేల్చుకుంటామని సవాల్ విసురుతున్నారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడిని టార్గెట్ చేసి చంద్రబాబు తీరును దుయ్యబడుతున్నారు. తమకు టికెట్ ఇవ్వాల్సిందేనని ఇప్పటికే అధినేత చంద్రబాబును కలిసి పట్టుబట్టారు. ఇవ్వకపోతే తాము భవిష్యత్ నిర్ణయం తీసుకోవల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో చంద్రబాబు కూడా పునరాలోచనలో పడ్డారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కొన్నిరోజుల్లో తన నిర్ణయం ప్రకటిస్తానని గుండ దంపతులకు నచ్చజెప్పి పంపించారు.

పాతపట్నం..



పాతపట్నం నియోజకవర్గంలోనూ సేమ్ సీన్. ఆ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన మామిడి గోవిందరావును టీడీపీలో బలమైన వర్గం వ్యతిరేకిస్తోంది. ముఖ్యంగా టికెట్ ఆశించి భంగపడిన కలమట వెంకటరమణ రోడ్డెక్కారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని చెప్పి నియోజకవర్గాన్ని చుట్టేశారు. తన వర్గంతో బల ప్రదర్శన కూడా చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఊరూవాడా వివరించి కేడర్‌లో సానుభూతి పొందారు. తామంతా కలమట వెంటే ఉంటామని, మామిడికి పనిచేసేది లేదని స్పష్టం చేశారు కూడా. అక్కడితో ఆగకుండా మామిడి గోవింద్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి మాట్లాడుతున్నారు. ఆయనొక అభ్యర్థా..! అంటూ పాతవన్నీ తవ్వి తీసి చెబుతున్నారు. ఈ క్రమంలో కలమటకు అధినేత నుంచి పిలుపురావడంతో వెళ్లారు. ఆయనకు కూడా హామీ ఇచ్చారు. న్యాయం చేస్తానని, తొందర పడొద్దని చెప్పడంతో కలమట వేచి చూస్తున్నారు.

పొలిటికల్ స్పాట్ లైట్

ఎచ్చెర్ల..



మరోవైపు కూటమి లోని బీజేపీకి కేటాయించిన ఎచ్చెర్ల అభ్యర్థి నడికుదిటి ఈశ్వరరావుపై కూడా అటు టీడీపీలోనూ, బీజేపీలోనూ వ్యతిరేకత చూపిస్తున్నారు. ఆయన్ని టార్గెట్ చేసి సోషల్ మీడియాలో ఇప్పటికే ఆడేసుకున్నారు. బీజేపీ నాయకులైతే ప్రెస్‌మీట్ పెట్టి తమ అసంతృప్తిని తెలియజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల కేటాయింపుపై రెండు పార్టీల నాయకత్వం పునరాలోచన చేస్తోంది. సీట్ల మార్పు కోసం సంప్రదింపులు చేసుకుంటున్నారు. ఇరువర్గాల అంగీకారంతో సీట్ల మార్పిడికి నిర్ణయం తీసుకుంటే అందులో ఎచ్చెర్ల ఉంటుందేమోనన్న అభిప్రాయం బీజేపీ, టీడీపీలో ఉంది.

పలాస...



పలాస విషయానికొస్తే ఇప్పటికే టీడీపీ అభ్యర్థిగా గౌతు శిరీషను ప్రకటించారు. ఆమె గ్రాఫ్ విషయంలో తేడాలొస్తుండటం, ఇదే సమయంలో జనసేన ఒక సీటును జిల్లాలో ఆశించడం, ఇప్పటికే తమకు కేటాయించిన పాలకొండ స్థానంలో పలాస కావాలా అని కోరుతున్నట్టుగా ప్రచారంలోకి రావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ఈ నియోజకవర్గాన్ని జనసేన తరఫున దానేటి శ్రీధర్ ఆశిస్తున్నారు. తానైతేనే మంత్రి సీదిరి అప్పలరాజుకు కనీస పోటీ ఇవ్వగలనని అధిష్టానానికి వివరించారు.

- ఇప్పటికే కోట్లు కుమ్మరించి టికెట్లు తెచ్చుకున్నారని సాక్షాత్తు ఆ పార్టీ నాయకులే బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. అందరి దృష్టిలో పడిపోయారు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సీట్ల మార్పుపై చర్చలు జరగడం, అభ్యర్థులు మార్పుపై కసరత్తు జరుగుతుండటంతో ఈ నియోజకవర్గాలు వాటిలో ఉంటా యని ప్రచారం కూడా జరుగుతోంది. దీంతో ఇప్పటికే ఆయా ప్రాంతాల అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. అభద్రతాభావంతోనే ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎక్కడ తమ బలం తగ్గిపోయిందని అధిష్టానం అభిప్రాయ పడుతుందన్న భయంతో బలనిరూపణ కూడా చేసుకుంటున్నారు. ర్యాలీలు, ప్రచార సభలతో హడావుడి చేస్తున్నారు. ఇదే సమయంలో టికెట్ ఆశించి భంగపడిన నాయకులు అధినేతల నిర్ణయం కోసం ఆశగా చూస్తున్నారు. సానుకూల నిర్ణయం వస్తుందని ఎదురు చూస్తున్నారు. తేడా వస్తే ఏం చేస్తామో అధిష్టానానికి ముందే సంకేతాలు పంపించారు. దీంతో ఆ నాలుగు నియోజకవర్గాల్లో అయోమయ పరిస్థితుల మధ్యే టీడీపీ ప్రచార ప్రహసనం జరుగుతోంది.

'ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న ఎన్నికలకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రతి అభ్యర్థి, అధికారి ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ ఫారం 6,7,8 కి సంబంధించిన వివరాలు తెలియజేశారు. రోజువారీ ఎంసీసీ రిపోర్టు ఎన్నికల అధికారికి అందజేస్తామన్నారు. సీజర్ బృందాల ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు. ఎన్నికల నియామవళిని అతిక్రమించిన ప్రభుత్వ ఉద్యోగులను, వలంటరీ వ్యవస్థలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సి విజిల్‌కు వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి వివరాలు తెలిపారు.

బాబు మాటలు నమ్మి

మోసపోవద్దు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

- ఎన్నికల ప్రచారంలో సీదిరి అప్పలరాజు, పేరాడ తిలక్

వజ్రపుకొత్తూరు రూరల్: అధికారం కోసం మోసపూరిత హామీలను గుప్పిస్తున్న చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంత్రి స్వగ్రామమైన మండలంలో గల దేవునల్తాడ గ్రామంలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీల ఏర్పాటుతో మళ్లీ చీకటి రోజులు వస్తాయన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితే అవినీతికి తావు లేని సంక్షేమ రాజ్యం వస్తుందన్నారు. పలాసలో కొందరు తాతతండ్రుల పేర్లు చెప్పుకుంటూ రాజకీయాలు చేస్తున్నారని అలాంటి వారితో జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు రెండు పర్యాయాలు అధికారంలో ఉండి జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి సీదిరి శ్రీదేవి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు తదితరులు ఉన్నారు.



దేవునల్తాడలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి హాజరైన జనసందోహం

ఓటరు కార్డుకు 31 ఏళ్లు

హిరమండలం: ఎన్నికల సమయంలోనే కాకుండా అన్ని సమయాల్లోనూ ఆదుకుంటున్న ఎన్నికల కార్డుకు 31 ఏళ్లవుతున్నాయి. 1950 జనవరి 25న భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైనా.. 1993 వరకూ ఓటరుగుర్తింపు కార్డులు అనేవి లేవు. దొంగ ఓట్లను నివారించాలనే ఉద్దేశంతో 31ఏళ్ల కిందట 1993లో టీఎన్ శేషన్ వినూత్నంగా ఆలోచించి ఓటరు కార్డు వ్యవస్థకు శ్రీకారం చుట్టారు.

అనుమతికి 'సుగమ్'



ఇచ్ఛాపురం: ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులు ప్రచారానికి వాహనాలు వినియోగిస్తుంటారు. వీటికి అనుమతి కోసం సుగమ్ పేరిట యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అభ్యర్థుల ప్రచారం సందర్భంగా రెండు వాహనాలు వినియోగించాలి. సభలు, సమావేశాల కోసం మరో నాలుగు వాహనాల కోసం ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలి. నియమావళికి విరుద్ధంగా వినియోగిస్తే అధికారులు సీజ్ చేస్తారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు వివరాలను పరిశీలించిన అనంతరం అనుమతులు జారీ చేస్తారు.

బైండోవర్ అంటే..?



ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికలు వచ్చాయంటే ఎక్కువగా వినిపించే పదం బైండోవర్. పాత నేరస్తులు, రౌడీ షీటర్లను బైండోవర్ చేయడం సహజం. ఒక వ్యక్తి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, ఆయన చర్యలు అనుమానాలకు తావిచ్చినా పోలీసులు ఆ వ్యక్తిని తహసీల్దారు లేదా ఆర్డీఓ ఎదుట హాజరు పరుస్తారు. చట్టవ్యతిరేక పనులు, చర్యలు చేపట్టనని బాండ్ పేపర్లపై లిఖితపూర్వకంగా హామీ తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేస్తారు. ఈ ప్రక్రియను బైండోవర్ (బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) అంటారు. హామీ తర్వాత కూడా తప్పు చేస్తే 24 గంటల్లో సదరు వ్యక్తిని అరెస్టు చేసి భారతీయ శిక్షాస్మృతి 107, 108, 109, 110 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు.

పింఛన్ల పంపిణీకి గడువు పెంపు



శ్రీకాకుళం పాతబస్టాండ్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ముందుగా పేర్కొన్న ప్రకారమైతే శనివారంతో ముగిసిపోయింది. అయితే అక్కడక్కడా లబ్ధిదారులు మిగిలిపోయినందున సోమవారం వరకు పింఛన్ల పంపిణీకి గడువును పెంచారు.

సంక్షేమ పతాకానికి సలామ్ అంటూ..

- వైఎస్సార్ సీపీలో జోరుగా చేరికలు
- టీడీపీ నుంచి వేలాదిగా వస్తున్న కార్యకర్తలు
- టీడీపీలో పాతవారికే కొత్తగా కండువాలు కప్పుకుంటున్న దుస్థితి



ఇటీవల వైఎస్సార్‌సీపీలోకి చేరిన మేఘవరం పంచాయతీ టీడీపీ మద్దతుదారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

శ్రీకాకుళం నగరంలోని పీఎన్‌కాలనీ, గుజరాతీపేట, ఎల్‌బీఎస్ కాలనీ, ఎంజీజీ కాలనీ, చినబజారు రోడ్డు, టౌన్ హాల్ ఏరియా నుంచి డాక్టర్ పొట్నూరు సీతారాం గుప్తా, ఊణ్ణ సర్వేశ్వరరావుతో వందలాది మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పెద్ద రెల్లి వీధిలో టీడీపీ నాయకుడు జ్యోతి ప్రసాద్ ఆధ్వర్యంలో 100 మంది చేరారు. మూడు సార్లు కౌన్సిలర్‌గా చేసిన టీడీపీ నాయకుడు బసవ లక్ష్మీ కుమారుడు మాధవ్‌తో పాటు అనేక మంది ప్రముఖులు చేరారు. శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో ప్రతీరోజూ చేరికలు జరుగుతున్నాయి.

- పలాస నియోజకవర్గంలో ఊళ్లకు ఊళ్లే టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నాయి. రాజాం కాలనీ, బుడారిసింగి, సిద్దిగాం, శాసనం పంచాయతీల్లో టీడీపీ దాదాపు ఖాళీ అయిపోయింది. ఆ పార్టీకి చెందిన సర్పంచ్, ఎంపీటీసీ స్థాయిలో పనిచేసిన నాయకులతో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. దాదాపు ప్రతిరోజూ ఇక్కడ టీడీపీ నుంచి చేరికలు జరుగుతున్నాయి.
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో గ్రామాలకు గ్రామాలే టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ముఖ్యంగా నరసన్న ముకుందపురం, కుంబరి నౌగం, సింకులి, సింగుపురం, గొల్లురు, సిరి మామిడి, తాళ్లభద్ర, బారువ, బారువ కొత్తూరు తదితర గ్రామాల్లోనైతే పెద్ద ఎత్తున టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు.
- నరసన్నపేట నియోజకవర్గంలో నరసన్నపేట టౌన్, శ్రీముఖలింగం, అర్లి, తర్లి, పెద్దలంబ, పద్మాపురం , వన విష్ణుపురం, కామేశ్వరపేట తదితర ప్రాంతాల్లోని టీడీపీ, జనసేన నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీలో చేరారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్‌లు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు, మాజీ నీటి సంఘాల అధ్యక్షులు ఉన్నారు.
- టెక్కలి నియోజకవర్గంలో మేఘవరం, నర్సింగపల్లి, పరశురాంపురం, గూడెం, సన్యాసిపేట, పెద్దసాన, కన్నెవలస, నీలంపేట, సోమనాథపురం, టెంకూరు, గుడ్డుమీదపేట నుంచి వందలాదిమంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు.
- పాతపట్నం నియోజకవర్గంలో పెద్ద లక్ష్మీపురం, మెట్టూరు నిర్వాసితుల కాలనీ, ఎన్ని రామన్నపేట తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. దాదాపు ప్రతి చోట చేరికలు జరుగుతున్నాయి.
- ఎచ్చెర్ల, ఆమదాలవలసలలో కూడా భారీగా చేరికలు జరిగాయి.

ఇలా జిల్లాలోని దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరుగుతున్నాయి. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో మేలు చేసిన వైఎస్సార్‌సీపీకి ఆకర్షితులై భారీగా చేరుతున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీలో జోష్ మరింత పెరిగింది. ఇప్పటికే పటిష్ట స్థితిలో ఉన్న వైఎస్సార్‌సీపీ తాజా చేరికలతో మరింత బలోపేతమవుతోంది. ఈ ఊపునకు టీడీపీ దాదాపు ఖాళీ అవుతోంది. కొన్నిచోట్ల గ్రామాలకు గ్రామాలే వైఎస్సార్‌సీపీలోకి చేరిపోతున్నాయి.

టీడీపీ డ్రామాలు

జరుగుతున్న డ్యామేజ్‌ను గమనించిన టీడీపీ కొత్త డ్రామాలాడుతోంది. ఆ పార్టీలో ఉన్న వారినే మళ్లీ చేరినట్టు చిత్రీకరిస్తోంది. గతంలో సుదీర్ఘ కాలం పనిచేసి రాజకీయ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీలోకి వచ్చి, ఎన్నికల సమయంలో మళ్లీ ఆ పార్టీలో చేర్పించుకుంటోంది.



ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని ఆధ్వర్యంలో చేరిన యువకులు (ఫైల్)

పాత కాపులతో సరిపెట్టుకుంటున్న టీడీపీ..

టీడీపీలో గతంలో పనిచేసి అధికారం పోయాక మౌనంగా ఉన్న కార్యకర్తలు, గతంలో ఆ పార్టీలో పనిచేసి, ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకున్న తర్వాత మళ్లీ సొంత గూటికి చేరిన వారు తప్ప వైఎస్సార్‌సీపీ నుంచి కొత్తగా వెళ్తున్న వారు కనిపించడం లేదు. ఆయారాం, గయారాంలనే టీడీపీ దాదాపుగా నమ్ముకున్నట్టు జరుగుతున్న చేరికలు స్పష్టం చేస్తున్నాయి. పంగ బావాజీనాయుడు, దువ్వాడ హేంబాబు చౌదరి, అంబల్ల శ్రీనివాసరావు, టి.సతీష్‌కుమార్, తమ్మినేని భూషణరావు రవీంద్ర జెన్నా, వజ్రగడ్డ శంకర్రావు, లంకవలస చంద్రరావు, బొరగాన హరి వెంకటరావు, రెడ్డి చిరంజీవి, పైల రమేష్‌నాయుడు, అట్టాడ రామ్ ప్రసాద్, నంబాళ రాజశేఖర్, ఎండ నాగేశ్వరరావు తదితర చోటా నాయకులు ఉన్నారు. వీరంతా గతంలో టీడీపీలో కొనసాగిన వారే. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీలో తలదాచుకుని ఎన్నికల ముందు మళ్లీ టీడీపీలోకి వెళ్లారు. ఇలాంటి చేరికలతో టీడీపీ కొత్త డ్రామాలాడుతోంది. ఆయారాం గయారాంలతో సంతృప్తి చెందుతోంది.

శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, ఇచ్ఛాపురం, పలాసలో ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన పలు వర్గాల ప్రజలు













కొత్తూరు: మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీలో శనివారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో చేరికలు

క్లుప్తంగా

ఎన్నికల చట్టాలను గౌరవించే పార్టీ వైఎస్సార్ సీపీ



కృష్ణదాస్‌కు ఎన్నికల చట్టాలు, నియమావళి పుస్తకాన్ని అందిస్తున్న గణేష్‌నాయుడు

పోలాకి: ఎన్నికల చట్టాలను గౌరవించి, నియమావళిని శతశాతం పాటించే క్రమశిక్షణ కలిగిన పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఆ పార్టీ లీగల్‌సెల్ జిల్లా చైర్మన్ జి.వి.వి.గణేష్ నాయుడు అన్నారు. శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను కలిసి ఎన్నికల చట్టాలు, నియమావళికి సంబంధించిన పుస్తకాన్ని అందజేశారు. రాజకీయాల్లో సీఎం జగన్ క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా గుర్తింపుపొందారని, చట్టాలను గౌరవించి రాజ్యాంగబద్ధంగా పరిపాలన నిర్వహించిన పార్టీకి ప్రతినిధులుగా బాధ్యతగా మెలగాలని పార్టీశ్రేణులకు సూచించారు. విపక్షాల ఎత్తుగడలు, కుట్రలకు ఆవేశపడకుండా న్యాయబద్ధంగా పోరాటం చేయాలని, అంతిమ విజయం న్యాయానిదేనని చెప్పారు.

24 గంటల్లోపు బోర్లు బాగుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామాల్లో పాడైన చేతిపంపు(బోర్లు)లను గుర్తించి 24 గంటల్లోగా మరమ్మతులు పూర్తి చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి ఎద్దడి, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి కొరత ఉన్న చోట్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. ఉపాధి వేతనదారుల రోజుకూలి రూ.300కు పెరిగిందని చెప్పారు. సోమవారం నుంచి జిల్లాలో 1.82 లక్షల మంది ఉపాధి పనులకు హాజరవుతారని తెలిపారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశాల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, డీపీఓ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎస్.వి.చిట్టి రాజు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ జి.జె.బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బుడ్డుయాత్ర



భక్తులకు అన్నప్రసాద వితరణ


ఇచ్ఛాపురం: పట్టణ పరిధిలోని బాహుదా నదిలో బుడ్డు యాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. బాహుదానది పరివాహక ప్రాంతంలో వెలసిన పాతాళ సిద్దేశ్వరాలయం వద్ద పరమశివుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

లజపతిరాయ్ కుటుంబానికి పరామర్శ



లజపతిరాయ్‌తో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్, అంధవరపు సూరిబాబు

టెక్కలి: అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ హనుమంతు లజపతిరాయ్ కుటుంబాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు తదితరులు శనివారం పరామర్శించారు. లజపతిరాయ్ తల్లి సుశీలమ్మ ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా టెక్కలి మండలం తలగాం గ్రామంలో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమానికి నాయకులు హాజరై సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.రమేష్, నాయకులు హెచ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లజపతిరాయ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



నరసన్నపేట: గెడ్డవానిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పొందూరు: తుంగపేటలో ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

విజయమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయమే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్ల పాలనలో జరిగిన సంక్షేమాభివృద్ధిని వివరిస్తున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నారు. పలాస, ఇచ్ఛాపురం, టెక్కలిలో శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



సంతబొమ్మాళి: ఎం.మరువాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, జెడ్పీటీసీ వసంతరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు



ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయకు గాజులు తొడుతున్న మహిళ



కొత్తూరు: మెట్టూరు బిట్-3 ఆర్‌ఆర్ కాలనీలో వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎచ్చెర్ల: లావేరు మండలం కొత్తకోటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారుల బృందం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని అంబేడ్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని జిల్లా అధికారుల బృందం శనివారం సందర్శించి ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందువరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. శతశాతం ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు నిర్లక్ష్యం వహించకుండా పోలింగ్ బూత్‌కు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు, డీఎస్‌డీవో కె.శ్రీధర్, సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వీప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సైతం ఓటు హక్కు, వేసవి తీవ్రత జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



ఎచ్చెర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఓటు హక్కుపై అవగాహన..

ఎచ్చెర్ల: మండల కేంద్రం ఎచ్చెర్లలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అన్ని ఎస్‌హెచ్‌జీ సంఘాల అధ్యక్షులతో స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం రామ్మూర్తి మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, నీ ఓటు–నీ భవిష్యత్తు అని నినాదాలు చేశారు.

ఆటో–ట్రాక్టర్ ఢీ



సాగునీటి కాలువలో పడిన ఆటో

- వృద్ధురాలు మృతి.. మరో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు



ఘటనా స్థలంలో మృతి చెందిన వృద్ధురాలు గౌరమ్మ



గాయపడిన రత్నం

నరసన్నపేట: మండలంలోని లింగాలపాడు సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుందరాపురం గ్రామానికి చెందిన మురపాక గౌరమ్మ(80) మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం సమీపంలోని తోటపాలెంలో కుమార్తె ఇంటి వద్ద ఉంటున్న గౌరమ్మకు స్వగ్రామం సుందరాపురంలో వితంతు పింఛన్ ఇస్తున్నారు. దీనిని తీసుకొని రెండు రోజులు అక్కడ ఉండేందుకు కుమార్తె బి.రత్నంతో కలసి సుందరాపురానికి ఆటోలో బయల్దేరింది. మార్గమధ్యలో ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్, ఆటో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆటో పల్టీలు కొట్టి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకుపోయింది. ఆటో నుజ్జు కాగా ప్రమాద స్థలంలోనే వృద్ధురాలు మృతి చెందింది. డ్రైవర్‌తో పాటు రత్నంకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ అశోక్‌బాబులు పరిశీలించారు. నరసన్నపేట ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పింఛన్ కోసం వెళ్తూ వృద్ధురాలు విగతజీవిగా మారడంతో కుమారుడు తాతయ్య, కుమార్తె రత్నం, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

వివాహిత ఆత్మహత్య



సంగీత మృతదేహం

మందస: మండలంలోని హంసరాళి పంచాయతీ చికిడిగాం గ్రామానికి బలియాసెట్టి సంగీత(27) అనే వివాహిత శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈమె అనారోగ్య కారణాలతో గన్నేరుపప్పు మింగింది. పొలం పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన భర్త కృష్ణ తీవ్ర అస్వస్థతకు గురైన భార్యను చూసి.. ఏమైందని అడుగగా పరిస్థితిని ఆమె చెప్పడంతో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆమె మరణించింది. భర్త కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు ఉపాధి శిక్షణ

ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్: యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో ఈ నెల 11 నుంచి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రామీణ ప్రాంత మహిళలకు కంప్యూటర్ అకౌంటెన్సీ టాలీ, మగ్గం వర్క్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9553410809, 7993340407 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పారిశ్రామిక అవసరాలపై అవగాహన



మాట్లాడుతున్న క్యూస్ట్ గ్లోబల్ సంస్థ టెక్నికల్ మేనేజర్ దిలీప్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత పారిశ్రామిక అవసరాలపై ఇంజినీరింగ్ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని విశాఖపట్నానికి చెందిన క్యూస్ట్ గ్లోబల్ సంస్థ టెక్నికల్ మేనేజర్ వై.దిలీప్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం 'సెమీ కండక్టర్ పరిశ్రమ విస్తరణ, ప్రస్తుత పరిణామాలు' అనే అంశంపై ఒక్కరోజు వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నూతన సాంకేతిక పరిజ్ఞానం అత్యంత వేగంగా విస్తరిస్తోందని చెప్పారు. పారిశ్రామిక రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని తెలిపారు. సాంకేతిక అంశాలపై పట్టు సాధించడంతో పాటు పారిశ్రామిక అవసరాలు తెలుసుకునేందుకు ఇంటర్న్‌షిప్ చేపట్టాలన్నారు. సెమీ కండక్టర్ రంగంలో మెమొరీ చిప్‌లు, మైక్రో ప్రాసెసర్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ తయారీ ఎంతో కీలకమని చెప్పారు. కంప్యూటర్, మొబైల్, హార్డ్‌వేర్, మెడికల్ వంటి అంశాల్లో భవిష్యత్తులో ఇంకా మార్పులు వస్తాయన్నారు. అమెరికా, థాయిలాండ్, చైనా వంటి దేశాల్లో సాంకేతిక ప్రగతి శరవేగంగా ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు చింతాడ రాజశేఖర్‌రావు, ఎస్.ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి టికెట్ తలనొప్పి

శ్రీకాకుళం: శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పరిస్థితి ముందుకు వెళితే నుయ్యి... వెనక్కి వెళితే గొయ్యిలా తయారైంది. ఇంతవరకు ఎంపీ ఇక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. గుండ, గొండు వర్గాల మధ్య అభ్యర్థిత్వం విషయంలో జరుగుతున్న పోరే దీనికి కారణమని అంతా అంటున్నారు. టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ శనివారం పట్టణంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీకి రావాలని ఎంపీని కోరగా తాను తప్పకుండా పాల్గొంటానని హామీ ఇచ్చారు. తీరా సమయం వచ్చేసరికి తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడును పంపించి ఇటీవలి తన నానమ్మ చనిపోవటం వల్ల కార్యక్రమానికి రాలేకపోతున్నామని జాబు పంపించారు. కానీ ఆమదాలవలస, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొనడం గమనార్హం. శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. గుండ అప్పలసూర్యనారాయణ వర్గం రోజుకో సమావేశం నిర్వహిస్తూ ఒకటి రెండు రోజుల్లో తమకు టికెట్ లభిస్తుందని చెబుతుండగా, గొండు శంకర్ వర్గం రెండు రోజుల్లో బీ ఫారం వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు.

తుది దశకు టెన్త్ మూల్యాంకనం



స్పాట్ కేంద్రంలో ఎగ్జామినర్లకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్, డీఈఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల రెండు కేంద్రాలుగా జిల్లాలో ఏప్రిల్ ఒకటో తేదీన టెన్త్ మూల్యాంకనం మొదలైంది. మొత్తం 8 రోజుల పాటు జరగనున్న ఈ మూల్యాంకన ప్రక్రియ సోమవారంతో పూర్తికానుంది. జిల్లాకు 1.85 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వీటిలో బాలికోన్నత పాఠశాల కేంద్రంగా తెలుగు, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ పేపర్లకు దిద్దుబాటు చేస్తున్నారు. శ్రీచైతన్య పాఠశాలలో ఇంగ్లిష్, హిందీ, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ పేపర్లకు దిద్దుబాటు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

స్పాట్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్జేడీ..

పదో తరగతి మూల్యాంకన కేంద్రాలను పాఠశాల విద్య ఆర్జేడీ(విశాఖపట్నం) బి.విజయభాస్కర్ శని వారం పరిశీలించారు. ఉత్తరాంధ్ర జిల్లాల టెన్త్ మూల్యాంకన కేంద్రాల పరిశీలనలో భాగంగా జిల్లాకు వచ్చిన ఆయన స్పాట్ కేంద్రంలో ఏర్పాట్ల ను ముఖ్యంగా వసతులను, సౌకర్యాలను పరిశీలించారు. ఫర్నీచర్, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, మరుగు దొడ్లు పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించా రు. వసతుల కల్పనపై ఆర్జేడీ సంతృప్తి వ్యక్తంచేశా రు. ఆర్జేడీ వెంట డీఈవో/క్యాంప్ ఆఫీసర్ కె.విజయభాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ లియాకత్ ఆలీ ఖాన్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు ఆర్.విజయకుమారి, ఎన్.రామకృష్ణ, హెచ్‌ఎం ఎం.వాగ్దేవి, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, సీఈలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఎంపీ అభ్యర్థిగా రాజశేఖర్



శ్రీకాకుళం న్యూకాలనీ: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా నాయుడిగారి రాజశేఖర్‌కు సీటు కేటాయిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజశేఖర్ యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్‌గా వ్యవహరించారు.